శ్రీ

---

సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. భాగ్యనగరం విద్యుద్దీపాలతో వెలిగిపోతూవుంది. సిటీబస్సులూ, ఆటోలూ, రిక్షాలూ నిర్విరామంగా తిరుగుతున్నాయి. జనం హడావుడిగా వెడుతూ వస్తూవున్నారు. ఎర్రమంజిల్ కాలనీకి పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కీ మధ్యలో వున్న ఆర్థోపెడిక్ హాస్పిటల్ మెయిన్‌గేటుకి కుడిపక్కగా వున్న పుస్తకాలషాపులో అన్నిరకాల వార, మాసపత్రికలూ, సినిమాపత్రికలూ ఆర్చీలు ఆర్చీలుగా కట్టబడివున్నాయి.

బియ్యే ఫైనలియర్ చదువుతూన్న ఇరవైయేళ్ళ అనిత ప్రతిరోజూ ఈ షాపుకి వస్తూవుంటుంది. తను కావాలనుకున్న పత్రిక తీసుకుని వెళ్ళిపోతూవుంటుంది. ఈరోజూ అలాగే వచ్చింది. తనలానే పత్రికలకోసం వచ్చే అమ్మాయిలను చూస్తూ కాస్సేపు అక్కడ నిల్చుని కాలక్షేపం చేయటం అనితకి అలవాటు, ఈ అలవాటు పొరబాటు అయి ఇంకాస్సేపు నిల్చుంది. తర్వాత తనకి కావల్సిన ఫిలిమ్‌ఫేర్ తీసుకుని షాపు యజమానికి డబ్బిచ్చివేసింది. వరసలుగా పేర్చిన 'సితారా' పేజీలు గాలికి రెపరెపలాడుతూంటే ఆగి అటూ ఇటూ తిప్పి చూడసాగింది.

"చూడచక్కని చిన్నదీ! తెల్లచీర కట్టిందీ! బాడీ లంగా కన్పి స్తోంది." వెనుకనించి పాటలా రెండు గొంతులూ వినీ విన్పించనట్లుగా విన్పిస్తూన్నాయి. టక్కున తలతిప్పి చూసింది. ఇరవైయేళ్ళ కుర్రాళ్ళు ఇద్దరు ఒకరి భుజాలమీద ఒకరు చేతులు వేసుకుని చిన్నగా వూగుతూ పాడుతూ అనిత వెనక్కి తిరిగి చూసేసరికి పాట ఆపేసి పత్రికలు చూడ సాగారు. ఒకడు లావుగా పొట్టిగా ఉన్నాడు. ఒకడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు. చదువుకుంటూన్న కుర్రాళ్ళలానేఉన్నారు. ఈ ఇద్దరు కుర్రాళ్లూ అనితని ఏడిపించటం ఈరోజు కొత్తకాదు. దాదాపు వారంరోజులుగా సాగుతూనేవుంది. షాపు యజమాని వీళ్ళను గమనిస్తూంటే బుద్ధిమంతుల్లా నిలబడటం అతను తన పనిలో హడావుడిగా ఉన్నప్పుడు యికిలిస్తూ, సకి లిస్తూ వెకిలివేషాలు వెయ్యటం పాటలు పాడటం కొంతదూరంవరకూ వెంబడించి రావటం జరుగుతూనేవుంది. వీళ్ళ చేష్టలకి అనితకి బుస్సున కోపం వస్తూనేవుంది. అయినా తనని తను నిగ్రహించుకుని వెళ్ళిపోతూ ఉన్నది. అలాగే ఈరోజూ వాళ్లని కొరకొరా చూసి తిరిగి సితారా చూడ సాగింది. ఓ నిమిషం నిశ్శబ్దం తర్వాత మళ్ళీ పాట పారంభమైంది.

"చూడ సక్కని....సిన్నదీ "

అనితకి ఈరోజు యెందుకో చాల చికాకుగావుంది. శాంతం తెచ్చు కోవాలని ప్రయత్నిస్తున్నా బుస్సున కోపం వస్తోంది.

వెధవలు, గాడిదలు, మూర్ఖులు, రాస్కెల్స్....ఈ మగ వెధవ లకి బొత్తిగా బుద్ధి ఉండదు. వయసులో ఉన్న ఆడపిల్ల కన్పిస్తేచాలు... యేదో ఒకటిఅంటూ యేడిపిస్తూ వెంటపడటం అంటురోగంలావ్యాపిస్తోంది. అనుకుని పళ్ళు కొరుక్కుంది. నాలుగు రోజులక్రితం కూడా ఇలాగేకోపం వచ్చినా అణుచుకుని ఓ స్నేహితురాలిని సలహా అడిగింది. ఆ అమ్మాయి అనితని శాంతపరుస్తూ అంది. అనితా! యేనుగు దారిన వెడుతుంటే వూర

కుక్కలు అరస్తూ ఉంటాయి. అయినా ఏనుగు నదురూ బెదురూ లేకుండా అలా వెళ్ళిపోతూనే ఉంటుంది. నువ్వు వాళ్లవైపు చూడకు. పాటలు పాడీ పాడీ నోరు నెప్పెట్టి వాళ్ళే పోతారు" అంది మేరీ.

"ఇదే ఉత్తమమైన మార్గం" అనుకుని మేరీ సలహాని అక్షరాలా పాటించటానికి ప్రయత్నిస్తోంది. కానీ ఈరోజు కోపాన్ని అపుకోలేక పోతోందీ.

చీకటి పడుతూన్నదికూడా త్వరగా ఇంటికి వెళ్ళటం మంచిది అనుకొని పత్రిక వదిలి ఇంటిముఖం పట్టింది. మెయిన్‌రోడ్డువెంట కొంత దూరం నడిచి ఓ చిన్న సందులోకి మళ్ళింది. అనితా వాళ్ళ కొత్త ఇల్లు లోపలగా ఉంటుంది. చుట్టూ ఇళ్ళులేవు. ఇప్పుడిప్పుడే ఒకటి రెండు ఇళ్ళు కట్టే ప్రయత్నంలో పునాదులు తీసినవీ, సగం తీస్తున్నవీ ఉన్నాయి.

అనిత ఇక్కడివరకూ వచ్చింది. రోడ్డు లైట్లు వెలగటంలేదు. అందువల్ల చుట్టు చీకటిగావుంది. ఆ దారివెంట యెవరూ నడవటంలేదు.

"అమ్మయ్య వాళ్ళు వెళ్ళిపోయినట్లున్నారు. ఇంక ఫర్లేదు" అనుకుని అలవాటు అడ్డుదారివెంట వేగంగా నడవసాగింది. కొంతదూరం నడవకముందే ఆ కుర్రాళ్లు యిద్దరూ యెటునించి వచ్చారో దారికి అడ్డంగా నిల్చుండిపోయారు. ఇహిహీ అంటూ ఇకిలించసాగారు.

అనిత ఆశ్చర్యపోయింది క్షణం.

అనితా! యెన్నాళ్ళిలా నీచుట్టూ తిరగడం...యెన్నాళ్ళు మాట్లాడవు...యెన్నాళ్లు ఇలా ఏడిపిస్తావు...నిన్ను మేమిద్దరం గాఢంగా ప్రేమించాం...నువ్వు...అంటూ పొట్టివాడు మరీ దగ్గరికి వచ్చేశాడు.

"అనితా నీ జాకెట్‌మీద గొంగళిపురుగు పాకుతోంది... తీసేస్తావుండు" ఐక్కగా ఉన్నవాడు చేత్తో తీయబోతున్నట్లు నటిస్తూ చెయ్యి వేశాడు.

అనితకి ఆగ్రహం ముంచుకు వచ్చింది. ముఖం ఎర్రబడి[illegible]ంది ఆవేశంతో. క్షణం నిగ్రహంగా నిలబడిపోయింది.

"రాస్కెల్స్ చెయ్యి వేస్తావురా!" అంటూ ఒకేఒక్క దెబ్బకొట్టింది.

"బాబోయ్ చచ్చాను...దేవుడా చచ్చాను" అంటూ వెనక్కి వెళ్ళిపోయి అంతకితరోజు కుర్సిన వాన నీళ్ళతో నిండిన పునాదిగోతిలో పడి పోయాడు. ఇది చూసిన రెండోవాడికి పౌరుషం ముంచుకొచ్చింది.

"యేయ్ నీకేంత పొగరే ఆడదానిని యేడుస్తూ కూలబడక మాకే యెదురు తిరుగుతావా! చూడు నిన్ను ఏంచేస్తానో! నిన్నేంచేసినా నీడిక్కెవరో చెప్పుకో అంటూ యేదేదో వాగుతున్నాడు.

అనిత రాయిలానిల్చుని ఓక్షణం చూసింది. వాడికీధైర్యంవచ్చింది.

"ఇహిహీ-ఏంపిల్లా గుండె జారిపోయిందా! చూడనీ యెక్కడికి జారిందో" అంటూ ముందుకు రాబోయాడు. అంతే వాడి చేతిమీద రెండే రెండు దెబ్బలు వేసింది. వాడు గూడు వూడిపోయినంతగా కెవ్వుమన్నాడు.

"బాబోయ్! నీకు 'కరాటే' వచ్చా! నా చేయి విరిగిపోయిందే. ఈ సంగతి తెలిస్తే నీ జోలికి చస్తే ఒచ్చేవాళ్లంకాము. నువ్వు ఆడదానివికావు రాక్షసివి. లంఖిణీ, దెయ్యానివి" అంటూ వాగుతూంటే మరో రెండు తగలనిచ్చింది. వాడు "బాబోయ్ చచ్చాను." అంటూ వెనక్కి తిరిగిచూడకుండా పారిపోయాడు. పునాదిగోతిలో పడ్డవాడు పైకి రావటానికి ప్రయత్నిస్తూ తడిమట్టి జారి బురదచీళ్లలో మునుగుతూ తేలుతున్నాడు.

"చావు వెధవా, నీలాటివాళ్లకి ఈశాస్తికూడాచాలదు. తుపుక్కున వాడి ముఖాన వుమ్మేసింది. వెనకనించి వస్తూన్న ముసలిమేష్టారువస్తూ పలకరించారు. (అనిత వాళ్ళ ఇంట్లోనే అద్దెకున్నారు ఆయన).

"అనితా! చీకట్లో యెక్కడినించమ్మా వస్తూన్నావూ! యెవడా ధప వగరుస్తూ పారిపోతున్నాడు! అదేమిటీ నీముఖం అలా అయిపో యిందేమ్మా. ఆగాడిద నిన్నేమన్నా అనలేదుగదా!" ఆతురతగా అడిగారు మాష్టారు.

జరిగిన విషయం అంతా మూడుముక్కల్లో చెప్పేసింది అనిత. అంతా విన్నారు.

"ఆ"....ఆశ్చర్యంగా చూడసాగారు.

"మాష్టారూ మీరు ఓసారి నాతో అన్నమాటలు నాచెవుల్లో ఇప్పుడు ప్రతిధ్వనిస్తూన్నాయి: అవేవంటే" అనితా తోడేళ్ళూ, గుంటనక్కలూ, నరరూపరాక్షసులలాంటి మగాళ్ళు నిండివున్న నేటి సమాజంలో స్త్రీకి రక్షణ లేదమ్మా. ఈ రక్షణ 'లేదు' 'లేదు' 'కావాలి' 'కావాలి' అంటూ వూరే గింపులూ మీటింగులూ ఆర్థింపులూ చేస్తే వచ్చే రక్షణ యెవరిదని రక్షించ గలుగుతుంది! ఈ సృష్టిలో ప్రతీ ప్రాణీ తనని తను రక్షించుకోవల్సిన అవసరమే వస్తే ప్రాణాలు ఒడ్డి పోరాడుతుంది. కానీ స్త్రీ యేం చేస్తోంది? తను అబల. ఆ మగాడొచ్చి రక్షించాలని వాపోతుందే తప్ప మరేం చెయ్యటంలేదు. ఇది పిచ్చితనం అనితా! ఈకాలంలోని స్త్రీకి పిరికితనం లేదు. అవసరం వస్తే తనని తను రక్షించుకునే ప్రయత్నంలో కొంత శిక్షణ పొందవల్సిన అవసరం యెంతో వుందమ్మా. ఇందుకు చాలా మార్గాలు ఉంటాయి, కరాటే, వగైరా వగైరా. అది నువ్వు నేర్చుకో" అంటూ ప్రోత్సహించారానాడు. అదెంతో ఉపకరించిందీనాడు. మాష్టారూ మీకు కృతజ్ఞతలు యెలా చెప్పాలో అర్థంకావటంలేదు."

"పిచ్చితల్లీ నాకు కృతజ్ఞతలెందుకమ్మా. నువ్వు పిరికి మొఖం వెయ్యకుండా ధైర్యంగా నిలబడ్డందుకు గర్వంగాఉంది. అయితే ఆదుర్మా ర్గుల్ని తరిమి కొట్టానుకదా అని నువ్వు బేఫర్వాగా వుండకూడదను."

"యేం చెయ్యమంటారు చెప్పండి"

"అనితా మన చుట్టూవున్న సమాజాన్ని చూస్తే ఓ సత్యం అర్థమవుతుంది. చూడూ తప్పుచేసిన యెందర్నో పట్టి బంధించి న్యాయస్థానానికి అప్పగిస్తున్నారు. పోలీసులు న్యాయస్థానం వారి వారి కేసులని విచారించి దాని ప్రకారం శిక్ష విస్తోంది. అయితే ఈ శిక్షలు అనుభవించిన ప్రతి ముద్దాయీ తను చేసిన తప్పుకి పరివర్తన చెందుతున్నాడా? లేదు. నూటికి యెనభై మంది తెల్సుకోవటంలేదు. పైగా శిక్షవిధించిన న్యాయాధికారిమీద పగబడుతున్నాడు! వీలు చిక్కితే హతమారుస్తున్నాడు. ఇలా ఎందుకు జరుగుతూన్నది? ఇలాంటి మనుషులే సమాజానికో 'బెడద'గా తయారైనారు. వీళ్ళని యెవరు మార్చగలరు? మార్చుకోవాలంటే మనిషి మనిషికీ చదువూ సంస్కారం కావాలి. ఇదివున్న మనిషి తప్పు చెయ్యడు. తెలియక చేసినా పశ్చాత్తాపపడతాడు. మరోసారి తప్పు చెయ్యడు. పురుషులలో ఇలాటి పరివర్తన కల్గినాడుగానీ స్త్రీకి రక్షణలేదు. ఆ కాలం వచ్చేవరకూ స్త్రీ తనని తను రక్షించుకునే ప్రయత్నంలో ఉండితీరాలమ్మా".

ముసలాయన ఆయాసపడుతూ చెప్పి ముగించాడు.

"మేష్టారూ మీరు చెప్పింది నిజం" అని ఒత్తిపల్కింది అనిత.

"ఈ కాలం ఆడపిల్లలు ధైర్యవంతులూ సూక్ష్మగ్రాహులూ అని నా నమ్మకం. సరే పొద్దుపోయింది-పదపోదాం."

అనిత భుజం ఆసరాగా చేసుకుని నడవసాగారు మాష్టారు. అనిత చీకటిలోంచి వెలుగులోకి నడవసాగింది. *